

శతకాలు

భక్తి,జ్ఞాన,నీతి

వీరాంజనేయ శతకము








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020050014279

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

ఉన్నవ

వీరాంజనేయ శతకము

ఉన్నవ రామకృష్ణ ప్రణీతము

మొదటికూర్పు : 500 ప్రతులు.

చీరాల,

శ్రీ రామకృష్ణా ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1939

[వెల రు 0-2-0

శ్రీ

ఉన్నవ

వీరాంజనేయ శతకము

సీ॥ శ్రీరామసేవక! శ్రితజనరక్షక!
భక్తాళిపోషక! ప్లవగముఖ్య!
నిగమార్థవేద్యక! నిశ్చలస్వాంతక!
పరమార్థదాయక! వరవివేక!
సుగుణాలవాలక! సురముని స్తోత్రక!
దాసాళిపాలక! దయనిధైక!
భవబంధవారక! బ్రహ్మాండనాయక!
యాపన్నివారక! యసురహాతక!

సుజనపోషక! సుశ్లోక! శోకహాతక!
అభయదాయక! శాకినీ యరివిపక్ష!
హరిపద విధేయ! ఉన్నవపుర సుగేయ!
అఖిల రిపుకులాజేయ! వీరాంజనేయ!!

సీ॥ బ్రహ్మాదితోషదక్ష! రాక్షసాళి విపక్ష!
కపుల సైన్యాధ్యక్ష! కల్పవృక్ష!
పండితకులపక్ష! భక్తజనాపేక్ష!
దిననాయక సదృక్ష! త్రిదశరక్ష!
రామకార్య సుదీక్ష! రావణ కులశిక్ష!
పుణ్యపాప విచక్ష! బుధులదృక్ష!
మునికుల సంరక్ష! పూర్ణదయావీక్ష!
భుజశౌర్యబలదక్ష! సుజనమోక్ష!

అతుల కరుణాకటాక్ష! పద్మాయతాక్ష!
పరమతారక సంత్రాక్ష! వరవిమోక్ష!—హరి॥

సీ॥ జనకజార్తిహారాయ! జగదాధిపత్యాయ!
చిరకాల జీవాయ! శ్రీనికాయ!
చిద్రూపకారాయ! శ్రీ విశ్వరూపాయ!
కామనివారాయ! ఘనయశాయ!
సుగ్రీవమిత్రాయ! శోభితాకారాయ!
రఘురామ భక్తాయ! రమ్యకాయ!
పీతాంబరధరాయ! ప్రేమస్వరూపాయ!
వజ్రశరీరాయ! వైభవాయ!

శ్రితజనాభీష్టదాయ! సత్సేవితాయ!
దీర్ఘవాలాయ! విక్రమతేజకాయ!—హరి॥

సీ॥ రాజభక్తుండవు రాజతాంత్రికుఁడవు
సుగ్రీవు బంటువు శోభితుఁడవు
సాహసాంకుండవు సత్యవ్రతుండవు
సుగుణగణ్యుండవు శుభకరుఁడవు
కపినాయకుండవు గౌరవార్హుండవు
విమలహృదయుఁడవు విశ్రుతుఁడవు
కూ్రరసంహారుఁడవు వీరవరుండవు
దైత్యాంతకుండవు ధార్మికుఁడవు
కీర్తివంతుఁడ వీవు సంకీర్తనుఁడవు
శాశ్వతుండవు సర్వవిశారదుఁడవు—హరి॥

సీ॥ సర్వనుతశరీర! శాఖామృగాకార!
అరుణాస్య గుణధీర! యఘవిదూర!
భూతాదికనివార! భూరిశౌర్యోదార!
మునిమానసవిహార! మోక్షకార!
ధూమాక్షసంహార! దూతకార్యాధార!
సకల విద్యాసార! చారుహార!
నిగమార్థగోచర! నిఖిలసన్నుతశూర!
ముల్లోక హితకార! మోహదూర!
రామకార్యధురంధర! రణవిహార!
అసుర భీకర పటుశౌర్య! యమిత ధైర్య!—హరి॥

సీ॥ శ్రీ వీరహనుమంత! చిన్మయ గుణవంత!
మంజుల సుస్వాంత! మతి నియంత!
దానవాళి కృతాంత! ధైర్య శౌర్యోదంత!
అతుల విస్తరశాంత! యోగమాంత!
భూతాదికవధాంత! భూరి రోగనిహంత!
వర సుగుణాకాంత! వైరిహంత!
సకల మేధావంత! సన్మునీ హృద్యంత!
కిన్నరీ గణమంత్ర! కీర్తివంత!

అతుల సర్వస్వతంత్ర! విద్యాప్రదాంత!
సాధురక్షణ గుణతంత్ర! సత్స్వతంత్ర!—హరి॥

సీ॥ శ్రీరామ పద సరసీరుహంబుల నెప్డుఁ
గొలువంగ వ్రతమెద్ది సలిపినావొ!
శ్రీరామ రూపవిశేషంబు సతతంబుఁ
గాంచ నే పుణ్యంబుఁ గడపినావొ!
శ్రీరామ భద్రుసుస్మేరాననవుఁ బల్కు
విన ధర్మమేమిఁ గావించినావొ!
శ్రీరాము పజ్జన గారాబమునఁ జెల్మి
సేయంగఁ దపమేమి జేసినావొ!

రాము కార్యంబుకైఁ బుట్ట నేమి జపముఁ
జేసినాడవొ! నీ భక్తిఁ జెప్పరాదు!—హరి॥

సీ॥ శ్రీరామపద సరసీరుహంబులఁ దేనెఁ
గ్రోలు భృంగమగాను కేలొనర్తు
శ్రీరామనామ సచ్చింతనామృత గాన
లోల భృంగమగాను కేలొనర్తు
శ్రీరామ హృదయాబ్జసీమావిహారవి
లోలమౌ భృంగమ కేలొనర్తు
శ్రీరామనయన రాజీవాశ్రయానంద
లోలమౌ భృంగమ కేలొనర్తు

పదములందుఁ బ్రసూనముల్, మదిని రూప
ములను నిల్పెడి భృంగమ మ్రొక్కులిడుదు—హరి॥

సీ॥ శ్రీరామ పాదరాజీవమాధురి రుచిఁ
దవిలి తీపినిఁగొన్న దైవమీవు
శ్రీరామ దివ్యసుశ్రీరూపమునుఁగన్న
తీపినిఁగొన్న తాంత్రికుఁడవీవు
శ్రీరామనామ సత్పారాయణపుఁ దేనెఁ
ద్రావి తీపినిఁగొన్న తండ్రివీవు
శ్రీరామ వచనవిస్తారపీయూషంబుఁ
గ్రోలి తీపినిఁగొన్న కుశలుఁడీవు

రోమకూపంబులన్నియు రామనామ
మధువుచే నిండి పండిన బుధుఁడవీవు—హరి॥

సీ॥ మహి భక్తరత్నాళి మణిపూసవంచని
కీర్తినొందిన భక్తిమూర్తివీవు
దాసవరులలోఁ బ్రథమగణ్యుఁడవటంచు
నిండు పేర్గన్న దాసుండవీవు
దూతలలోనెల్ల దొడ్డదూతవటంచుఁ
బ్రతిభఁగాంచిన దూతపతివి నీవు
సేవకావళిలోన సేవాభిముఖుడంచుఁ
బ్రఖ్యాతిఁగొన్న సేవకుఁడవీవు
పేర్మి శ్రీరామభక్త-శ్రీరామదాస-
రామదూతవు-సేవకరాజువీవు——హరి॥

సీ॥ నీ పాదయుగళిని నేఁ బట్టుకొందును
పరిచర్యఁజేయుట సరగనేర్ప
నీరూప మనిశంబు నే నిల్పుకొందును
భక్తిభావంబులఁ బరగనేర్ప
నీనామమెప్పుడు నే గానమొనరింతు
నానందతత్త్వంబు నరయనేర్ప
నీ సుగుణాళిని నే ధ్యానమునుసేతు
పరహితకార్య తత్పరతనేర్ప
నిన్నుఁ గనుగొందు నేకైకనిష్ఠతోడ
జ్ఞానమును నేర్ప, మోక్షసుశ్రీనిఁ గూర్ప——హరి॥

సీ॥ నీ పరిచర్యల నేర్పునకై ఁగాదె
సేవకుఁ దనపత్నిఁ జేరమరచు
నీ నిర్మలస్నేహ నిక్షేపమునఁగాదె
తన సోదరాళినిఁ దలఁపమరచు
నీ భక్తిగుణ భావ నియమంబుననుఁగాదె
యీరేడులోకంబు లేలమరచు
నీ బాహుబలదర్ప నిష్ప త్తినింగాదె
తన విక్రమంబు నంతయును మరచు

రామభద్రుండు-త్రైలోక్యరక్షకుండు
నీ ప్రభావంబు నింక వర్ణించుటెట్లు?—హరి॥

సీ॥ నీ పరిచర్యల నిష్ఠతోఁజేతును
శ్రీరామవిభునకుఁ జెప్పుమయ్య
నీ నామముదలఁతు నిశ్చలభక్తిమె
శ్రీరామవిభునకుఁ జెప్పుమయ్య
నీ రూపమునుఁ జిత్తసారూప్యముగఁజేతు
శ్రీరామవిభునకుఁ జెప్పుమయ్య
నీ బంటుగానుందు నెమ్మితో నాకోర్కె-
శ్రీరామవిభునకుఁ జెప్పుమయ్య

'భక్తి నిన్నించు, సుగుణ సంపత్తినించు
కరుణరక్షింపు' మంచు-విఖ్యాతచరిత!—హరి॥

సీ॥ అనిశంబు నీ చరణాబ్జముల్ బూజింతు
నవ్యాజకృపఁజూప నరుగుదెమ్ము
అనుదినంబును నీ శుభాకృతిఁ గననెంతు
సాక్షాత్కరింపగ సాగిరమ్ము
అనయంబు నీ నామమునుఁ బ్రీతిగణియింతు
నియతితో హృత్పీఠి నిలువరమ్ము
అశ్రాంతమును నీ ముఖాబ్జచంద్రునిఁగాంతుఁ
గరుణార్ద్రదృష్టితో నరయరమ్ము
చిఱునగవుతోడ ననుఁజూడఁ జేరరమ్ము
పిల్లవాఁడని పిలువఁగాఁ బ్రేమరమ్ము — హరి॥

సీ॥ పావనంబైన నీ పాదధూళిని నాదు
శిరముపై నుంచుమీ శ్రేయమొప్ప
శుభమగు నీరూపు స్ఫుటముగా నా చిత్త
మందుంచుమీ మోక్షమట్టె యొలుక
కల్పశాఖినిఁబోలు గరము నాపై నుంచు
కామితార్థంబుల గణములబ్బ
అమృతాకరంబగు నక్షిద్వయంబును
నాదిక్కుఁ బ్రసరింపు మోదమెసఁగ
శిరముఁ బంకించి గనుము వాంఛితముగలుఁగ
చిఱునగవుతోడ మాట్లాడు చింతదొలఁగ — హరి॥

సీ॥ వానరవరుఁడని వట్టివాఁడందునా
దేవతావరములఁ దీయుటొకటి
కోఁతివాఁడంచని చేఁతగాదందునా
గాలించి సీతనుఁ గాంచుటొకటి
ప్లవగపిభుఁడని పంక్తుచూపందునా
యోషధీంద్రముఁ దెచ్చి యుంచుటొకటి
హరికులోత్తముఁడని యాటలాడందునా
నిగమాంతమునుఁ గని నేర్చుటొకటి

సాక్ష్యములుగాఁగ నీశక్తి జగతియెఱుఁగు
నెఱుకఁగలవాఁడ ననుఁబ్రోవ వెఱఁగిఁకేల —— హరి॥

సీ॥ తోఁకవాఁడని నీకు దూరమందుందునా
పండుగా నిను నోటఁ బట్టుటొకటి
వనచరుఁడని నిన్ను వదలుదమందునా
బ్రహ్మచర్యపుదీక్షఁ బరఁగుటొకటి
శాఖామృగమవని సరిపుచ్చుకొందునా
భక్తియుక్తులతోడఁ బ్రబలుటొకటి
కపికులుఁడని నిన్నుఁ గనఁజాలనందునా
విశ్వరూపంబున వెలయుటొకటి

యిట్టి నీ మహిమంబు లెన్నేనిఁగలవు
నిన్ను నమ్మితి దయఁజూడు నిర్మలాత్మ! —— హరి॥

సీ॥ రుద్రాంశమున విశ్వరూపుండవై యొప్పి
దనుజాళి మర్దించి దనరుటొకటి
బ్రహ్మాంశమునఁబుట్టి బ్రహ్మయువై బ్రహ్మ
చర్యంబుననిల్వఁ జాలుటొకటి
విష్ణ్వంశమున లోకవిహితంబుఁ గావింప
భక్తాళికల్పమై బరఁగుటొకటి
పవనాంశమున హెచ్చు బలియుండవై సర్వ
జన రంజకుండవై సాగుటొకటి

గాగ శుభలక్షణాన్విత గతిఁదలిర్ప
నంజనీ కేసరులకు నీ వవతరిలవె!—హరి॥

సీ॥ నీ సుస్వరూపంబు నేఁగాంతుఁ గనులారఁ
బ్రత్యక్షముగరమ్ము పవనతనయ!
నీ వాక్యమాధురి నేవిందుఁ జెవులార
నాదరంబునఁ బల్కు మాంజనేయ!
నీనామ జపమును నేఁజేతు మనసార
లేశ మోరిమిఁజూపు కీశముఖ్య!
నీ కుప్పిగంతుల నేనెంతుఁ దనివార
సుంత జూపుము హనుమంతదేవ!

నీ కృపామృతధార పానీయమిమ్ము
భక్తిఁ గడుపారఁద్రావుదుఁ బ్లవగముఖ్య!—హరి॥

సీ॥ బ్రహ్మాండభాండమా ప్రపంచకమునందు
నణువులో నణువైతి నాదరింపు
నిను భక్తిఁగొల్చెడి నిశ్చలభక్త స
మ్ముఖమందు నణువైతి ముదమునింపు
వేదశాస్త్రపురాణ వివిధార్థ కోవిద
శ్రేణిలో నణువైతిఁ జిత్తగింపు
సకల చరాచర జంతు సంతాన సం
ఘంబులో నణువైతిఁ గరుణఁ బెంపు
సేవకాళిలో నణువైతి స్వీకరింపు
సారెసారెకుఁ ద్వత్పదార్చనముసేయ—హరి॥

సీ॥ శ్రీరామనామంబుఁ జిత్తమందుఁ దలంప
వజ్రదేహుండవై వరలితివట!
శ్రీరామనామంబుఁ బారాయణముసేయుఁ
జిరకాలజీవివై చెలఁగితివట!
శ్రీరామనామ విశేషంబుఁ బఠియింప
ననుపమ జయముచే నలరితివట!
శ్రీరామనామంబు స్థిరముగా జపియించి
నిత్యసౌఖ్యంబున నెగడితివట!
సర్వశక్తులు గల్గిన సాహసివట!
నాకు నేర్పుము నీభక్తి నమ్మినాను—హరి॥

సీ॥ సంజీవిఁ దెమ్మన సకలమూలిక పర్వ
తముఁ దెచ్చి వైచిన దాతవీవు
జనకాత్మజాత యేచక్కి నున్నదో సుంత
గాంచి రమ్మన లంకఁ గాల్చితీవు
ఆగంతకుఁ డెవఁడో యరసి రమ్మని పంప
సఖ్యంబుఁ జేసిన స్వామివీవు
వననిధిదాటంగ పథముఁగాంచుమటన్న
వారధిఁగట్టిన నలుఁడవీవు

కార్యసఫలత, విమల గాంభీర్యగుణము,
నలఘు మైత్రియు నతిశక్తిగల మహాత్మ! — హరి॥

సీ॥ సుజనసాంగత్యంబు శుభమను కోరిక
నొప్పిన కపులలో నొక్కరుఁడవు
భక్తిసాధనచేత భగవంతు వీక్షించి
యుండిన ప్లవగాళి నొక్కరుఁడవు
తత్త్వార్థమునెఱింగి ధరణీశుఁ గనుఁగొని
యున్న వానరతతి నొక్కరుఁడవు
పరహితకార్య తత్పరవిలాస శుభగు
ణోన్నత కీశాళి నొక్కరుఁడవు

మర్కటేంద్రులలో నెల్ల మహిమ, కీర్తి,
ఘనతలనుఁ గన్నవాఁడ వొక్కరుఁడవీవె! — హరి॥

సీ॥ మనుజజన్మంబెత్తి మనసు నిల్పఁగనైతి
కోఁతివైన నాకంటెఁ గోవిదుఁడవు
నరుఁడనై భగవంతు నరసి గన్గొననైతి
వానరా! నాకంటె జ్ఞానివీవు
మానవాభిముఁడనై మహిమ నేర్వఁగనైతి
మర్కటా! నాకంటె మాన్యుఁడీవు
జనుఁడనై వేదశాస్త్రములఁ జదువనైతి
హరికుల! నాకంటె ననఘుఁడీవు

వ్యక్తిగల్గియు నీ దివ్య పాదధూళి
కైన సరిబోలనైతి-భక్తాగ్రగణ్య!—హరి॥

సీ॥ సజ్జనసాంగత్యసారంబు గ్రహియించి
బెద్దలసేవలఁ బెనఁగినావు
భక్తిమార్గం బతి ప్రాముఖ్యమంచని
బరమేశు పాదముల్ బట్టినావు
తత్వమార్గమరసి సత్వప్రధానివై
విజ్ఞానపథమున వెలసినావు
వైరాగ్యమహిమచే వర్తిల్లి సగుణ ని
ర్గుణ దర్శనంబులఁ గుదిరినావు

నీవె జ్యోతిస్స్వరూపమై నిర్మలముగ
వెలిఁగినావు సూక్ష్మస్థూల విధులెఱింగి—హరి॥

సీ॥ కఠినకంటకయుత కాంతారముల దాటి
సీతనుఁ గనుఁగొన్న దూతయెవఁడు?
విక్రమదోర్దండ వీరవర్యులఁ జెండి
ఖ్యాతిగాంచినయట్టి దూతయెవఁడు?
స్వామి కార్యార్థమై సాగరమ్ముల దాటఁ
బ్రీతితోఁ బూనిన దూతయెవఁడు?
ముమ్మూర్తుల కజేయ ముదిత శిరోమణి
జ్యోతి రాముకిడిన దూతయెవఁడు?

నీవెకా ధాత్రిజారామదేవవరులఁ
దెలసి సద్భక్తిఁ గొలిచిన యలఘుమతివి — హరి॥

సీ॥ సుగ్రీవు నమితశోభగ్రీవు మైత్రికి
మించి సామ్రాజ్య మేలించినావు
శ్రీరాము శుభగుణశ్రీరాము కరుణకు
లీలగా లంక గాలించినావు
సీత వినుతయశోపేత సంప్రీతికిఁ
దివిరి దనుజుల మ్రందించినావు
లక్ష్మణు నతిధైర్యలక్ష్మణు జెల్మికి
విగత మూర్ఛితుని గావించినావు

అడుగుమాత్రన వారిఁ గృతార్థులనుగఁ
జేసితివి నా వినతి వృథసేయుటెట్లు? — హరి॥

సీ॥ వాలి సుగ్రీవులు వైరంబుతోనుండ
నీతి బోధనుజేసి నిలుపలేదె?
అన్న శౌర్యంబుకై నదర సుగ్రీవుండు
శుభమగు ఋష్యాద్రిఁ జూపలేదె?
శ్రీరామ లక్ష్మణుల్ సీతాలతాంగిని
వెదకుచు రా గౌరవింపలేదె?
శుభదాయకంబుగా సుగ్రీవ రఘువీర
వరులకు మైత్రి నేర్పరుపలేదె?

కపికులేశుకుఁ బట్టంబుఁ గట్టలేదె?
ననుఁ గృపాన్వితమతిఁ గాంచుటనగ నెంత?—హరి॥

సీ॥ సుగుణాకరుండును సూనృతాచరణుండు
నత్యంత భూతదయాకరుండు
నగు రాము వీక్షించి యంజలి గావించి
బరిచర్యసేయుచుఁ బరఁగుచుండ
సీతఁ గన్గొన కపి శ్రేణిఁబంపుచు నీదు
కార్యదీక్షఁ దలంచి ఘనయశుండుఁ
బ్రేమతోడుతఁ బిల్చి రాముముద్రిక నిచ్చి
తత్కార్యకరణవిధంబుఁ బూను

మనఁగఁ దరులను గిరులను నట్టిదాఁటి
తహహ నీ స్వామిభక్తి నేమనఁగవచ్చు?—హరి॥

సీ॥ సంపాది దెలుపంగ జానకి మార్గంబు
సంద్రంబుదాటంగ శక్తిలేక
కపులెల్లఁ దమ బలక్రమములఁ దలఁపోసి
వీరవర్యుఁడులేడె వేగ నుఱుక
నని చింతనొందంగ నట్టహాసముఁజేసి
విశ్వరూపంబున వెలసి లీల
లంఘించి సంద్రంబు లంక కే నరిగెద
సీతవార్తనుఁదెత్తు శీఘ్రరీతి
ననుచు బ్రహ్మాండభాండంబు నావరించి
జనవె భీకరరూప ప్రసంగవృత్తి—హారి॥

సీ॥ శ్రీరామనామంబుఁ జిత్తంబులోపల
స్మరియించుచును మింటి కరిగినావు
శ్రీరామరూపంబు జెలఁగి ముందాడంగ
వనధిపై లంఘించి వరలినావు
రామభక్తుఁడవంచు రంజిల్లి మైనాకుఁ
డాహ్వానమీయంగ నరిగినావు
జానకీదేవికై జనెదనని సురస
యడ్డంబుఁ దగులంగ నణచినావు
సులభముగదాఁటి సంద్రంబు శుభకరముగ
నలము వేలాద్రి నెక్కితివౌర హనుమ!—హారి॥

సీ॥ రామకార్యార్థమై భీమరూపంబునఁ
జనువాఁడెవండని సాగి సురస
భూనభోంతరములు భోరునఁ జెలఁగంగఁ
దనువుఁ బెంచియుఁ వేగఁ దనర వరుస
ద్విగుణీకృతాకృతి దిక్తటంబులు నిండ
హెచ్చు బలంబున నేఁగనరసి
తన గహ్వరంబును దద్దటిల్లఁగ సర్వ
దిక్కులకునుఁ బెంచి నిక్కి మెరసి
మశకరూపంబు వహియించి, మాయనించి,
కుక్షిఁజీల్చియు సురసను గూల్పలేదె?—హరి॥

సీ॥ ఆ సువేలాద్రిపై నరుణుండు గ్రుంకిన
దాఁక గూర్చొనియుండి దరలి వేగ
ననితరదుర్గమమైన లంకాపురీ
విభవంబుఁ గన్గొని వేడ్క సెంది
కోటవాకిలిఁజొచ్చు ఘూర్ణిల్లి లంఖిణి
భీమరూపంబునఁ బెనఁగిలాగ
విసరివేయఁగ వెలి వింతరూపంబున
ద్వారంబు గడవంగ తల్లడిలఁగ
నరచి చేఁబట్టి వేయంగఁ దిరుగఁద్రిప్పి
ముష్టిచే ఱొమ్ముఁబొడువంగ 'మొఱ్ఱొ' యనదె?—హరి॥

సీ॥ లంకాపురాంగన లంఖిణిఁ బడఁగూల్చి
కోట లీలగఁజేరి గోప్యముగను
సౌధాంతరంబులు సౌందర్యశాలలు
రత్నకోవెల సుమారామములును
విద్యుత్ప్రభోద్దీప వేదిక మంటప
నవగోపురంబులు నలుగడలును
రావణాసురవరు రమ్యహర్మ్యంబులు
గాలించి మిక్కిలి గష్టమునను
రాముదేవినిఁ గాన కారాటపడుచు
వెదకుచు నశోకవనమును వేడ్కఁగనవె!—హరి॥

సీ॥ లంకాపురివెదకి శంకాన్వితస్వాంత
మున నచటి యశోకవనముఁజొచ్చి
యందుఁ జూచుచుఁబోవ 'హా రామ-హా రామ'
యను నార్తనాదంబు నాలకించి
సంతసంబునఁ జెవి సారెసారెకు వంచి
విని రామనామంబు వే నుతించి
తన్మయావస్థలో 'దాశరథీ-రామ'
యంచు శబ్దముజాడ నరుగుదెంచి
త్వరగఁ గాంచవె శ్రీరామ ధర్మపత్ని
నచట వృక్షపుఁ గ్రీనీడ హార్ద్వమునను—హరి॥

సీ॥ శ్రీ జానకీదేవి జీర్ణశల్యములతో
జీర్ణాంబరముఁగట్టి 'శ్రీరఘువర'
యని బల్కుచును లేచి యాక్రందనముఁజేసి
మెల్లన కేశముల్ మెలచి చీర
చెరఁగుతో బంధించి చేర్చి గళముఁగట్టి
'శ్రీరామ-శ్రీరామ-సీత యసుర
నాయకుపురిలోనఁ బ్రాయోపవిష్టయై
చావనున్నది మీరు గావలేరె?'

యనుచు నురిఁబడుతఱి నీవు ఘనతనేఁగి
రామముద్రికనీయవె రమణి కపుడు!—హరి॥

సీ॥ శ్రీరామముద్రికఁ జిత్తంబు హర్షింపఁ
బరికించి ప్రాణంబుఁ బల్లవింపఁ
జేకొని ముద్రిక 'శ్రీరామ' యని బొంగి
వినుతించి 'నిన్నును విశ్వసింప
నిజరూపుఁజూపుము నిశ్చింతతోనుందు'
నన విశ్వరూపంబుఁ గనఁగఁజేయ
నాశ్చర్యమునుఁజెంది 'హనుమంత నీరూపుఁ
దగ్గింపు'మని సీత తగనుతింప

సూక్ష్మరూపావఁ గోఁతివై జోతలిడవె
రామవార్తలఁ జెప్పియు క్షేమమునవె!—హరి॥

సీ॥ రామవృత్తాంతంబు రామకుఁ బోధించి
రమణివృత్తాంతంబు రఘువరునకుఁ
జెప్పంగ జానకి శ్రీశిరోభూషణం
బుత్సాహముననిచ్చి 'యొక్క నెలకు
రాకున్న చత్తును రాఘవునకుఁ దెల్పు'
మని చెప్ప రంజిల్లి యవనిసుతకుఁ
బ్రణమిల్లి, 'తినుటకై ఫలముల నిమ్మ'న
'వనమందుఁ గొనుమ'న్న ఘన యశోక
వనమునం బండ్లుఁదిని రావణునకు నీదు
రాక దెలియఁజెఱచితి వారామమపుడు—హరి॥

సీ॥ ఆ యశోకవనము నట్లు ధ్వంసముఁజేసి
పారవైచియు మంచి పండ్లుమెక్కి
కావలివారలఁ గడిమిచేఁ దఱుమంగఁ
బాఱి రావణు దరిఁజేరి మ్రొక్కి
'మర్కటరూపుండు మన యశోకవనంబుఁ
బెరికి మమ్ములఁ గొట్టితిరిమె' ననఁగ
'అతనిఁ బట్టితెం'డంచు రావణుడంత
శౌర్య దైత్యులఁబంప స్తంభమెక్కి
వారిఁ జంపవె రావణుఁ 'డౌర! కోఁతి
యేమి-దనుజవరులఁ గూల్చుటేమి?' యనఁగ—హరి॥

సీ॥ రోషకషాయిత రూక్షేక్షణుండయి
వీరభటులఁ బంపి ,వేగఁబట్టి
తిట్టి కొట్టుండఁ దివిరి రక్కసిమూక
వచ్చి విజృంభింప వారిదిక్కు
వీక్షించి వాలంబు విస్తరంబుగఁ బెంచి
దనుజగాత్రములకుఁ దగ ఘటించి
నేలఁ బడంగొట్ట చాల రాక్షసపంక్తి
మృతిఁజెందె నవ్వేళ, మేటిజెట్టి
నీవటంచునుఁ దెలియ నుర్వీస్థలాన
భీతిగలుగంగ నుంత నీ పేరువినఁగ—హరి॥

సీ॥ దిగులొంది రావణుఁడొగిని మంత్రులఁజూడ
నక్షయసుతుఁడు తా నడ్డువచ్చి
తనదు శౌర్యముఁజెప్పి తండ్రికి మ్రొక్కి 'నే
కోఁతి నిప్పుడ దెచ్చి ప్రీతిహెచ్చ
మీ కిత్తు'ననుచును మేటి సైన్యముఁగూడి
బాణవృష్టిఁగురియ బలము మెచ్చి
ధ్వజముఁగొని దనుజవరులనుఁ జెండాడి
యక్షయుఁ గూల్పఁగా నట్టెహెచ్చి
కోఁతులనుఁజూప నసురులు గోడుపడరె!
నిర్జరులు సంతసంబున నిన్నుఁబొగడ—హరి॥

సీ॥ ముజ్జగంబులగెల్చు ముద్దుకుమారుని
మరణంబువిని శోకభరముచేత
భూమినిఁ బొరలుచు ఘోరున నేడ్వంగ
మేఘనాథుఁడువచ్చి మిగులఁ దాతఁ
దగనూఱడించియు ధైర్యంబుఁగొల్పియుఁ
గపికులాధమునిప్డు గట్టి చేతఁ
గొనివత్తునని యాజ్ఞఁగొని వైభవంబునఁ
దరలి మిమ్ములఁదాక దైత్యభూత
ములను బిండిగాఁగొట్టి సమ్మోదమలర
నింద్రజిత్తునిమీఁదికి నెగయలేదె!—హరి॥

సీ॥ శౌర్యధీనిధి మేరుసమధైర్యవంతుఁడు
మేఘనాథుఁడుదాకి మేటి బాణ
ములనుఁ బ్రయోగించి మూర్ఛవోవఁగనేయ
నదరంగఁ గొట్టిన నరసి త్రాణ
గల శిలీముఖములఁ గ్రౌర్యంబుతోనేయ
ధ్వజమెత్తి నీవటు దారుణరణ
మొనరించి యసురేంద్రు నోడింప విసుఁగొంది
నిశ్చేష్టుఁడై వాఁడు నిలచి తరుణ
కాలమనుచు బ్రహ్మాస్త్రంబుఁ గడిమి నేయఁ
గలుగ నద్దానితో నీవు గట్టువడవె!—హరి॥

సీ॥ బ్రహ్మాస్త్రమహిమచే బంధింపఁబడనీవు
కొనిపోదె దనుజేంద్రు గూర్మిసుతుఁడు
రాకాసిమూఁకయు రావణుండును గడు
చోద్యంబుగా నినుఁజూడ నపుడు
దుముకఁ గట్లన్నియుఁదొలఁగఁగ వాలంబుఁ
బెంచి పీఠంబుగాఁ బ్రీతితోడ
రావణేంద్రునిమ్రోల రమణీయముగఁ గూరు
చుండి నీతులుఁజెప్పఁ జూచి వాఁడు
పండ్లు బటపటఁ గొఱకుచు 'పాడుకోఁతి'
నాలుకనుఁ గోయుఁడన నీవు నవ్వలేదె!—హరి॥

సీ॥ రామదూతను నిన్ను రాక్షసేంద్రుఁడు జంప
సమకట్ట నా విభీషణుఁడుజూచి
'దూతఁ జంపఁగరాదు దోషంబు ప్రాప్తించు'
నని భ్రాతకునుఁజెప్ప నట్టెలేచి
మండిపడుచువచ్చి మర్కటవాలము
న కనలముంపుడనంగ వేగ
దనుజాధములుగూడి తైలవస్త్రంబును
జుట్టి తోఁకకుఁ జిచ్చుఁబెట్ట నద్ది
మంటలెగయంగ నొక్కింత మారినువడక
లంకఁ గాల్చినయట్టి వలంతివౌర!—హరి॥

సీ॥ లంకను దహియించి బింకంబు వహియించి
గడియలోపల సీతఁగాంచి యామె
వృత్తాంతమంతయు విశదంబుగాఁగొని
వనధిదాటుచు గడుధ్వనులచేత
భూనభోంతరముల ధ్వానంబు లెగయంగఁ
జేయుచు వచ్చినఁ జెలఁగి కోఁతు
లన్నియుఁ దిలకించి యానంద ముప్పొంగ
నగురుచువచ్చి నీ యెడలఁజేర

జానకినిఁగన్న వృత్తాంత సరణితోడ
లంకఁగాల్చినవిధముఁ దెల్పంగలేదె!—హరి॥

సీ॥ సంతసించుచు వారు గంతులువైచుచు
నిన్నుఁ గాఁగిటఁజేర్చి నీ వివేక
బలములఁ గొనియాడి, పౌరుషంబు నుతించి
సీతాశిరోమణిఁ జేతఁబట్టి
గడుమొక్కి శ్రీరామకార్యంబు సఫలంబు
నొందినదనుచు నానందమొంది
అధిపుండు సుగ్రీవుఁ డధికహర్షంబందు,
రఘుకులవరుఁడు గరంబుమెచ్చి

మేలుసేయును దడయంగనేల యింక
ననుచు నినుఁ జేరిగొల్వరే యధికభ కి!—హరి॥

సీ॥ గడువుదినమునకుఁ గడు వేడ్కతో వచ్చి
కంజాక్షు శ్రీరాము కాళ్లనంటి
మ్రొక్కి, జానకివార్తఁ జక్కఁగా వినుపించి
శ్రీ శిరోమణినిచ్చి "సీతఁగంటి
'నెలరోజులకు మీరు నెలవుకు రాకున్నఁ
దనువుఁ బాసెద'నని తల్లి వింటె"
ననరామచంద్రుండు నట్లు దుఃఖించంగ
'నోరిమినొందుఁడీ యొక్క గంట

లోన సీతను దెచ్చెద నే'నంగ
రామభద్రుండు మెచ్చె నీ స్వామిభక్తి!—హారి॥

సీ॥ వివిధమర్కటజాతి నివహంబులను వేగ
రప్పించి జానకీరాము కార్య
సాఫల్యమునకునై సంతసంబందుచుఁ
గపివీరులందఱుఁ గడఁగి శౌర్య
గాంభీర్య సాహసక్రమములఁ జూపింప
గంతులువైచుచుఁ గడమి క్రౌర్య
ములఁ బల్కుచునుఁ జాల ముచ్చటగా యుద్ధ
సన్నద్ధులై యుండ సమధి కార్య

వరుల చరితంబులను దెల్పు చరులఁగూల్ప
సైన్యనాథుండవై నీవు జనఁగ లేదె!—హారి॥

సీ॥ అది యేమిజోద్యమో యమ్మహావనధిపై
వింతవారధిఁగట్టి వెలసితిరట!
అతి విశాలంబులౌ నద్రీంద్రములఁదెచ్చి
నీటిపై వింతగ నిల్పితిరట!
వృక్షరాజంబుల విరివిగాఁ బెకలించి
సుగమంబుగాఁ ద్రోవఁ జూన్పితిరట!
అతి వినోదంబుఁ జిత్రాంచితంబును నౌచుఁ
దేలియాడు తెరవుఁ దీర్చితిరట!

యెటుల వారధినిల్చెనో! యెటులమీరు
గట్టినారొకో! వర్ణింపఁగాదు నాకు——హరి॥

సీ॥ శతయోజనశరధి సైన్యవితతిదాటి
విడియ రక్షకుఁడవై వెలసినావు
రాత్రించరాళి తరలి యెదుర్కొనకుండఁ
బ్లవగాళికోటవై బరగినావు
రక్కసినివహంబు రావణుండువెఱవ
విశ్వరూపునఁగాపు వెడలినావు
రామలక్ష్మణులల గామరూపుల గంటఁ
బడకుండ బంటువై నడచినావు

స్వామికార్యంబునందింత శ్రద్ధజేసి
రామదాసాగ్రగణ్యా గౌరవముఁ గంటి!——హరి॥

సీ॥ మోహరంబున రిపువ్యూహంబులనుఁజించి
ప్రళయాంతకునిగ గన్పడితి, దిశల
నొకప్రక్క నుద్దండయుద్ధభటుండవై
గోఁతిమూకనుఁ బురిఁగొల్పి, రిపులు
రామలక్ష్మణులనుఁ గామరూపంబునఁ
జెనకుదురని యెంచి జిత్తమటులఁ
జేర్చి బోధించుచు, ననిఁ జిత్రంబుగఁ దిరిగి
కపుల బ్రాణంబులఁగాచి, సురలుఁ
బొగడ, దైత్యులు మొఱఁబెట్ట, బొల్చుభీతిఁ
బారఁజేయవె యాశ్చర్యభండనమున—హరి॥

సీ॥ శ్రీ లక్ష్మణస్వామిఁ జేకొని తరలిన
మఱియు రాఘవుఁ డనిమానిచింత
నని రావణుండాజికరుదెంచి రయమున
లక్ష్మణుఁదాకిన, లాఘవంత
మైన శరాళి దేహంబు దుళ్లఁగనేయ
ఘోరశక్తినివైచి గూల్చి గంతు
వేసి యెత్తుకొనంగ విఫలుఁడై యత్నింప,
నెటనుండియో నీవునేగి చెంత
ముష్టిఁ బొడువంగ దనుజుండు మూర్ఛవడఁడె!
నియతి నీశక్తి నెంత వర్ణింపఁగలను!—హరి॥

సీ॥ అమ్మహాశక్తిచే నడుగంట బ్రాణముల్
సౌమిత్రి ధరఁబడ రాముడంత
చిరదుఃఖభరమున దురపిల్లుచుండఁగఁ
గపివీరులందఱుఁ గాంచి చింత
నూనినవారలై 'వానరశ్రేష్ఠుండు
సంజీవిఁ దెచ్చిన స్వామి వింత
గా లేచు'నని, చేతఁగామికి సిగ్గిలి
యూరకనుండ, నే నుర్వివంతఁ

గలయ వెదకియుఁ దెచ్చెద ఘనునిఁబ్రోవ'
ననుచుఁ ద్రోవగ్రహించి నీ వరుగలేదె!—హరి॥

సీ॥ శ్రీరామునార్తికిఁ జింతించి చింతించి,
సౌమిత్రి మూర్ఛకైఁ జాలవగచి,
సీతామహాదేవి స్థితికినై యోజించి,
కౌసల్యశోకంబుఁ గడుఁదలంచి,
జనకు దుఃఖమునకుఁ జాల విచారించి,
భరతశత్రుఘ్నుల పాటు వెంచి,
'ఇనవంశ మతిదుఃఖమును బొందు నివ్వేళ
రక్షింప నద'నని గాముఁ దలఁచి,

'అరుణకాలంబునకుమున్న యౌషధులనుఁ
దెత్తు'ననుచును నీవటుఁ దేరిచనవె!—హరి॥

సీ॥ అల సమీరునికంటె నధికమౌ వేగంబు
నను బోవుచుండంగ దనుజుఁడొకఁడు
రావణుబంపున రయమున నేతెంచి
మునివేషధారియై వనమొకండు
ఘనముగా సృష్టించి 'హనుమంత యిటురమ్ము'
సౌమిత్రిలేచెను, రాముఁడిపుడు
మోదితుం డాతిథ్యమును గొనిపొమ్మన
'దాహమిమ్మ'న నీవు దనుజుఁడపుడు
తన కమండలూదకముఁ గైకొనుమనంగ
మాయ గ్రహియించి 'వలదని' మదుగుఁగంటి!—హరి

సీ॥ కపటమునీందుఁడిందు గమలాకరముఁజూప
జలపానమునుసేయు సమయమందు
మదమకరీంద్రంబు మరుఁగుగా నేతెంచి
త్వత్పాదములఁబట్టి దడయకందు
లాగగాఁగన్గొని లావుకుమెచ్చుచుఁ
దడయగరాదని దలఁచి ముందు
మశకమై కుక్షిలో మాటుగదూరియు
మొసలిపేగులఁ జీల్చి మోదమంద
గ్రాహము మృతించి గంధర్వకాంతగాగ
నిలచి ధ్యానించి చెప్పదే నిజచరిత్ర!—హరి॥

సీ॥ మడుఁగులో మకరిని మర్దింపఁదోఁచిన
యంగన యచ్చోటి యసురమాయ
విశదంబుగాఁదెల్పి విను వీథికేగినఁ,
గ్రోధాననివేగఁ గోర్కెనతఁడు
రూపభేదంబుల రుసరుసలాడుచు
'నిన్ను భంగముసేయ నేర్తు'ననఁగ
వాని నిలంగూల్చి వాయువేగంబున
సంజీవిగిరిఁజేరి సంబరమున

గరుడ గంధర్వ కిన్నర కామినులునుఁ
త్రిదశయక్షులుఁ బరికింప దీప్తిఁగనవె!—హరి॥

సీ॥ ఔషధీంద్రముఁగన నాశ్చర్య విద్యుత్ప్ర
భాతీతపటలమై ప్రబలునొకట
నరుణప్రభాపుంజ మావహిల్లు నొకప్పు
డింద్రనీలద్యుతి నెసఁగునొకట
ధావళ్యరుచులచేఁ దాండవంబాడుచు
శ్యామలరీతిమై నలరునొకట
కోటి సూర్యద్యుతి, కోటి చంద్రప్రభ
రేకెత్తఁగా దేజరిల్లునొకట

వివిధకాంతుల విలసిల్ల వేడ్కఁజెంది,
యరయలేకను సంజీవి నద్రిఁగొనవె!—హరి॥

సీ॥ ఘోరవక్రగ్రహ కోపానలపుశక్తి
వాతఁబడినఁ గూడ భీతిలేదు
కర్కోటక కఠోరకపటుండు దైత్యుండు
కాలనేమివిశిఖఁ గదలలేదు
గరుడకిన్నరయక్ష గంధర్వ వరముఖ్య
విద్యాధరులకైన వెఱవలేదు
చిత్రప్రభావ సంజీవిదీప్తులఁ గాంచి
యబ్బురపడి వెన్క కరుగలేదు

వైరులను జెండి మూలికవర్గఁ జూచి
పర్వతమునంతఁ బెకలించు ప్రౌఢిఁ గనవె! — హరి॥

సీ॥ ఔషధగిరిచర్య యాశ్చర్యమునముంప
సంజీవి యిదియను సంజ్ఞలేక
మ్రాన్పడి శ్రీరాము మదిలోన స్మరియించి
విశ్వరూపంబున వెలసి తోఁకఁ
బెంచి బర్వతమునుఁ బెకలించి దోఁకతో
బంధించి యినుమంత బరువులేక
కందుకక్రీడగాఁ గరమున ధరియించి
తీవ్రశక్తి సవితృదీప్తిరాశి

పూర్వమటఁ జేరి సౌమిత్రి మూర్ఛఁ దీర్చి
నిలచితివి రాముమ్రోల నంజలి ఘటించి! — హరి॥

సీ॥ సౌమిత్రి జీవింప సంతసంబున రాముఁ
డాలింగనముఁ జేసి యభినుతించి
'నీ పరోపకృతికి, నేస్తంబునకు ఋణ
బడితి'ని నిగ్గదుఁ బ్రస్తుతించి
'ముల్లోకములజనుల్ ముందుగా నీదర్శ
నముఁ జేసి తనుఁ జేరఁ బ్రముదమం'చు
వచియించి తన కృపావారాశి విమలత
రంగ పంక్తిని మునుగంగ నుంచి

తేల్చడొకో! నీదుపుణ్యంబుఁ దెల్పవశమె!
నీ దయామృతరసము నామీఁద జల్లు!—హరి॥

సీ॥ మొదట రాఘవునితో ముచ్చట లొనరించి
సద్గుణుండని చూచి సఖుఁడవైతి
రాజాధిరాజని రాత్రింబవళ్ళును
బరిచర్యసేయు సేవకుఁడవైతి
వీరవర్యుండని వేదాంతవిదుఁడని
కార్యసాహాయ్యత ఘనుఁడవైతి
భగవంతుఁడని మెచ్చి పాదకంజమ్ముల
భక్తితో నర్చింపఁ బాయవైతి

సఖ్య, భృత్యవిజ్ఞాన, నిష్కామ, మోక్ష
తత్త్వములు వర్ణనలుసేయఁ దరమెనాకు'—హరి॥

సీ॥ అనితరలభ్యంబు నతిశుభదంబగు
సంజీవిఁ దెచ్చిన శక్తివంత!
ఎవఁడు దాటనివార్థి నవిరళగతిఁ దాటి
జానకిం గనుఁగొన్న సత్యవంత!
నిత్యసంచారియై నెగడు భాస్కరుజెంత
విద్యలఁ గన్న వివేకవంత!
సకలదేవాళికి సంతసంబొఁరించి
శాశ్వతాయుఁడవైన చారువంత!
రామ సౌమిత్రులకు ముందు రాజసముగ
బహుళవినుతులఁ గొనియెడి భాగ్యవంత!—హరి॥

సీ॥ కపిశేఖరుండేడ! విపుల భక్తిజ్ఞాన
వైరాగ్యసంపత్తి వరలుటేడ!
మర్కటవిభుఁడేడ! మహిమాన్వితంబైన
బ్రహ్మచర్యపుదీక్షఁ బ్రబలుటేడ!
హరికులోత్తముఁడేడ! నాశ్చర్యమైనట్టి
వర చిరంజీవన బిరుదమేడ!
కోఁతికులుండేడ! కోరిన వరమిచ్చి
దేవోత్తముండని దెలియుటేడ!
శౌర్యమదియేడ! దనుజులఁ జంపుటేడ!
వింతయగు నీ చరిత్రంబు వినినకొలఁది!—హరి॥

సీ॥ నీ పాదధూళికై నేఁడు నీదరిఁజేరి
సేవింపవచ్చితి శ్రేయమొసఁగు
నీ దర్శనమునకై నే నాసఁగొనిపజ్జ
స్మరియింపవచ్చితి శరణమొసఁగు
నీ మహాభక్తికై నిశ్చలంబుగ దాపు
వసియించి భజియింతు వరమొసంగు
నీ కృపారసముకై నీచెంతఁజేరి నీ
లీలఁ గీర్తించెద మేలొసంగు

రామునకుఁ బ్రియుఁడవనుచు నామనంబు
నందు నిను నమ్మికొల్చెద నభయమిమ్ము!—హారి॥

సీ॥ శ్రీరామునకుఁ బ్రీతిఁజేయంగఁ దలఁపోసి
రాక్షసాళిఁ బరిమార్పంగలేదె!
జనకాత్మజకుఁ బ్రీతిజరుపంగ నూహించి
బలుకష్టసంతతుల్ బడయలేదె!
కపివీరునకుఁ బ్రీతిఁగల్పింప యోజించి
యతనితోఁ గానకు నరుగలేదె!
సౌమిత్రికినిఁ బ్రీతిసలుపంగ మదినెంచి
సంజీవిఁదెచ్చి యొసంగలేదె!

హితముఁజేయంగ నీకంటె నెవరుగలరు?
దరినిఁజేరితి నామీఁద దయనుజూపు—హారి॥

సీ॥ రామకార్యంబన రంజిల్లఁ జేతువు
నాదుకార్యంబన నవ్వెదీవు
రామనామంబన రమణీయముగ నెంతు
నాదునామంబన నడచిరావు
రామరూపంబనఁ గామించిచూతువు
నారూపమనగను బారెదీవు
రామవాక్యంబన రాజిల్లివినెదవు
నాదువాక్యంబన నమ్మలేవు
ప్రభువుకన్నను సద్భక్తి విభవమొప్పు
సేవకునుడి హెచ్చనుచు యోజింపలేవె!—హరి॥

సీ॥ భూమిజారాములుఁబూజ్యసింహాసనా
రూఢులై యుండ నిరూఢభక్తి
నతినమ్రగతి మెయి నంజలి ఘటియించి
వాలంబుముడిచి శోభాప్రసక్తి
శిరముఁ గ్రిందికివంచి జిత్తమొక్కటిజేసి
భయభక్తులేకమై బరవశోక్తి
విలసిల్లి బంటువై వేడ్కతో శ్రీరాము
లను గొల్చుచుండవే లక్ష్యయుక్తి
వారిఁ బ్రేమను గ్రహియించి భూరిమహిమ
నలరుచుండవె జగతి మహానుభావ!—హరి॥

సీ॥ నీ మహాతత్వార్థ నిర్ణయంబునఁగాదె
శ్రీరాముఁ డాగమ శ్రేణిఁజెపుట
నీ మహాసత్కార్య నిపుణతకైగాదె
రఘుకులోత్తముఁ డాదరముఁగనుట
నీ మహాసద్భక్తి నిశ్చలగతిఁగాదె
శ్రీరఘూద్వహుఁడు నిశ్చేష్టుఁడగుట
నీ మహాపరిచర్య నిక్షేపమునఁగాదె
రాము డానంద విభ్రాజియగుట

నీ మహత్వంబునకుఁగాదె నిరతమిలను
ముందు నీదర్శనముఁజేయ మోక్షమనుట!—హరి॥

సీ॥ పేరు మర్కటరాజు బెను జితేంద్రియమతి
యిల బ్రహ్మచర్యాశ్రమ మెవనివశము!
పేరు వానరపతి ధీరుండు భక్తుండు
నెఱుఁగ సాక్షాత్కార మెవనివశము!
పేరు లాంగూలుండు భీషణవీరుండు
నెన్న జయమునిశ మెవనివశము!
పేరు ప్లవఁగు డతి ప్రియహితైకచణుండు
భువిఁ గార్యదక్షత యెవనివశము!

రామునకు ముందు దర్శనస్వామియగుట
యెవనివశమౌను నీకెగా కెఱుఁగనెఱుఁగ'—హరి॥

సీ॥ సీతామహాదేవి శ్రీరామముద్రనుఁ
జేకొని చిరకాల జీవమిడదె!
సీతామహాదేవి చెలఁగి మీ సాహాయ్య
సంపత్తికిని రత్నసరములిడదె!
సీతామహాదేవి శ్రేష్ఠమా నీసేవ
లకు రత్నకుళ్లాయి లాగులిడదె!
సీతామహాదేవి చెలువారు నీనయ
గుణవితతికి ముద్దుకొడుకువనదె!

సతము జానకీరాముల సత్కృపాప్ర
సారమందె దెంత యదృష్టశాలివయ్య! — హా౨॥

సీ॥ అని నీదు శౌర్యధైర్యాదు లెంచుదమన్న
నిన్నెదిర్చి పరుఁడు నిలువలేడు
ధర నీదు సాహసౌదార్య మెంచుదమన్న
నీ కీడుజోడు గణింపలేడు
అల నీదు భక్తివిద్యాదు లెంచుదమన్న
నినుఁబోలునట్టి మనీషి లేడు
ధృతి నీదు పరహితవ్రతము నెంచుదమన్న
స్వార్థరహితుఁడు నీ సాటిలేడు

నీ ప్రభావవిశేషంబు నేర్చునెవఁడు!
ఘనతరానన్యకీర్తి సంజనితమూర్తి! — హా౩॥

సీ॥ విశ్వరూపంబున వీరుండవై పెంచి
విస్తరింప సభము విరిగిపడదె!
రోదసీకుహరంబు ఛేదభావంబుండ
రవి చంద్ర తారాదు లవిధిఁబడవె!
భూమి గిఱ్ఱనఁదిర్గు, ఘోరున సంద్రముల్
గల్లోలయుతములై గదలిపోవె!
దానవానీకంబుఁ దల్లడిల్లుచునుండ
నారుల గర్భముల్ జారిపడవె!

సురలు, మునులును వణకుచు స్తోత్రములను
సేయు భీకరరూపానఁ జెలఁగుదార!—హరి॥

సీ॥ భువిఁ బరహితకారి బూజ్యుండు నెవఁడన్నఁ
దొలుత నీనామంబుఁ బలుకవలయు
వర కార్యదీక్షచేఁ బరఁగువాడెవఁడన్న
నాదిని నీపేరు ననఁగవలయు
వినయవిధేయుండు వీరుండు నెవఁడన్న
శీఘ్రంబ నీపేరుఁ జెప్పవలయు
పరమవేదాంతి సద్భక్తుండు నెవఁడన్న
వడివడి నీపేరు నుడవవలయు

నిండు దయఁజూపు దేవుం డెవండటన్నఁ
దొలుత నీపేరు వచియింపవలయు సుమ్మ!—హరి॥

సీ॥ భానునొద్దకునేగి బ్రహ్మాండమంతయుఁ
జౌకళించిన రూపుఁ నాకుఁజూపు
సంద్రంబుదాటెడు సమయంబునందుండు
భీకరరూపంబు నాకుఁజూపు
భూమిజ 'నమ్మను, పొ'మ్మన్న గగనంబు
దాకఁ బెంచినరూపు నాకుఁజూపు
సౌమిత్రిఁ బ్రతికింప సంజీవికరిగిన
నాటి యుత్తమరూపు నాకుఁజూపు
దినము నీ భక్తవరులకు దివ్యదర్శ
నంబు దయసేయురూపంబు నాకుఁజూపు—హారి॥

సీ॥ శ్రవణగానముఁజేసి చక్కగారమ్మ వీ
రాంజనేయా! యన్న నగపడవుగ
అతినుతిఁగావించి యాదరమ్మున రమ్మ
హనుమంత! యనివేఁడ నగపడవుగ
ప్రీతితోఁ బ్రణతులర్పించి రమ్మికఁ బవ
నాత్మజా! యనిబిల్వ నగపడవుగ
ధ్యాసతో నాసతోఁ దవిలి కేసరి తన
యా! రమ్మటంచన్న నగపడవుగ
యెటుల బిల్వంగవలయునో-యేమి సేయ
వలయునో నన్నుఁ దయఁజూడ వాయుపుత్ర!—హారి॥

సీ॥ బాల్యంబులో సుంత బాగోగులెఱుఁగక
నాటపాటలయందు నాసఁజెడితి
యౌవనోదయమందు సందమౌ యువతుల
ముద్దు ముచ్చటలతో మోహపడితి
ముదుసలితనముఁ బుత్రపౌత్రిలతోడ
మురిపెంబులాడుచు మోదపడితి
దారాసుతాదులుఁ దనువు శాశ్వతమంచుఁ
జెడుగతుల ధనముఁ జేరనిడితి

నొక్కదినమైన నీనామ ముచ్చరింప
సమయమెఱుఁగను జన్మజన్మములయందు—హరి॥

సీ॥ భువి విషయాసక్తమోదినై బాపఁపుఁ
బంకిలంబునఁబడి బందినైతి
కామాది షడ్వర్గకాంక్షలకునుఁ జిక్కి
చచ్చుచుఁ బుట్టుచు శవమునైతి
జ్ఞానబాహ్యేంద్రియ చలనంబునకుఁజిక్కి
సంసారవహ్నికి శలభమైతి
నిత్యమనోబుద్ధి నియతవిభ్రమణాది
కాజ్ఞానములఁజిక్కి యంధుఁడైతి

జడతవీడినసేవ యొక్కఁడెగణింప
ముక్తిసాధనమంచు సద్భక్తిఁగంటి—హరి॥

సీ॥ ఉదయంబుననలేచి ముదముతో వండుచుఁ
దినుచుఁ బండుచు నిన్నుఁ దెలియలేదు
దారాసుతాదుల, ధనమోహములనమ్మి
శాశ్వతంబంచు నీ స్మరణలేదు
వ్యర్థప్రసంగాళి నానతోసల్పుచుఁ
బొద్దుపుచ్చుచు నిన్నుఁ బొగడలేదు
వృథమైన చుట్టాలవిందు పొందులలోన
స్థిరమతి నిన్నుఁ బూజింపలేదు

యిట్టిమూఢుఁడ నాత్మజనేచ్ఛఁ దవిలి
యుంటి, భవబంధవిచ్ఛేద మొందుటెట్లొ!—హరి॥

సీ॥ రామభక్తుఁడవంచుఁ బ్రేమించి నీ పాద
భక్తుండనై తిని బట్టిచూడు
రామదాసుఁడవంచు రంజిల్లి నీ పాద
దాసుండనై తిని దయనుఁజూడు
రామసేవకుఁడంచుఁ గామించి నీ పాద
సేవకుండై తిని చేరిచూడు
రామశిష్యుఁడవంచు రాజిల్లి నీ పాద
శిష్యుండనై తిని జేరిచూడు

రామకరుణావలోకన రాశివగుట .
నీదు గరుణావలోకన మొదమిడదె!—హరి॥

సీ॥ కోఁతిరూపుఁడవైన గుణములో నెంచంగ
సజ్జనశ్రేష్ఠులు సాటిరారు
అడవిమానిసివైన నచ్చంపుబత్తిలో
సకలమునీంద్రులు సాటిరారు
మృగశాబకంబైన నిగమాంత తత్త్వవి
జ్ఞానంబునను బుధుల్ సాటిరారు
భటపతివైనను భయరోగములఁబాపు
శక్తిలో హరిహరుల్ సాటిరారు
గుణగణంబుల సరిరారు గోటిసురలు
నీకు నీవొక్కఁడవె సాటి యో కపీంద్ర! — హరి॥

సీ॥ శ్రీరామపాదరాజీవసన్నిధి రెండు
హస్తముల్ జోడించి, మస్తకమును
వంచి, నిర్మలమైన వరచిత్తశుద్ధితో
భక్తి సేవింపంగఁ బ్రబలముగను
సరససుధావృష్టి స్వచ్ఛమై పూతమై
వ్యాపింప స్వామియుఁ బరవశమున
గారాబమునుఁ బెంప 'శ్రీరామ,' యని నీవుఁ
దన్మయత్వంబునఁ దనరువేళఁ
జూచువారలు, వినువారుఁ జోద్యమంద
నొక్కరొక్కరు మిళితులై యుండకొక్కొ! — హరి॥

సీ॥ నీ మహాసత్కార్య నిర్ణయవితతికి
నాదిశక్తెంతటి యనఘురాలు!
నీ సుజనత్వంపు నేర్పరితనమున
బ్రహ్మదేవుండెంత ప్రాభవుండు!
నీ పరహితభావనీయతివిశ్రేణికి
శ్రీవిష్ణువెంతటి భావపరుఁడు!
నీ మహావిక్రమ నిర్ణితోత్తమయుక్తికి
మినుసిగవేల్పెంత మేటివాఁడు!

సుగుణములయందు ముక్కోటిసురలుఁబోల్ప
నెంతవారలు శ్రీ హనుమంత నీకు!___హరి॥

సీ॥ శ్రీరామపద సరసీరుహంబులనమ్మి
నిల్చితివేయట్ల నిల్చినాను
శ్రీరామ దర్శన శ్రీయలాలసుఁడవై
నిల్చితివేయట్ల నిల్చినాను
శ్రీరామచంద్ర సుస్థిరకృపాదృష్టికై
నిల్చితివేయట్ల నిల్చినాను
శ్రీరామవాక్సుధాధారాంబువులఁగ్రోల
నిల్చితివేయట్ల నిల్చినాను

నీవు రాముని నమ్మంగ, నేను నిన్ను
నమ్మినాఁడను దయఁజూడరమ్ము వేగ!___హరి॥

సీ॥ తారకమంత్రార్థసారంబు గ్రహియించి
దాసోహమని పాదదాసువైతి!
తారకజప సంవిధానంబుఁ గన్గొని
దాసోహమని నామదాసువైతి!
తారకమాధుర్యధారలఁ జవిఁగొని
దాసోహమని భక్తదాసువైతి!
తారకనామ విస్తారశక్తిని నమ్మి
దాసోహమని జ్ఞానదాసువైతి!
తారకపుమంత్ర ముఖ్యతత్త్వంబుఁ దెలియ
నీకు హరునకుఁ దక్కను నాకువశమె!—హరి

సీ॥ నాకుఁ బ్రత్యక్షంబుఁ గాకయుండుటచేత
నీరూపు వర్ణింప నేరనైతి
పెద్దలజిత్తర్వు లద్దంపుసుద్దులు
విని జేతనైనంత వెలువరచితి
భక్తిలేశంబైన శక్తిజాలకయున్నఁ
బట్టుపట్టియు నీకుఁ బ్రస్తుతిడితి
స్వప్నసుషుప్త్యాద్యవస్థలందైనను
గాన్పింతువోయని గనుఁదెఱచితి
నెపుడుఁ బ్రత్యక్షమౌదువో-యెపుడు నేను
గన్నులార దర్శింతునో-కన్నతండ్రి!—హరి॥

సీ॥ పంతమా గడు బలవంతమా పట్కావు
సుంతైన హనుమంత వింతయేల!
న్యాయమా గనరావు శ్రేయమా దాగంగ
హేయమా నాయెడ మాయలేల!
కోపమా నాయందుఁ గోప్యమా నాముందు
చపలమా నాపట్ల శపథమేల!
కష్టమా మిగుల నయిష్టమా నాచెంతఁ
గావవా నామీఁదఁ గ్రౌర్యమేల!

నేరమానాది ఠమ్మనఁ బారనేల!
యేలుమాయన్న నెడఁబాసి యేగనేల!—హరి॥

సీ॥ ఈదినంబిత్తువో యేదినంబిత్తువో
త్వద్దర్శనంబంచుఁ దలఁతునెపుడు
రేపు బూరింతువో మాపు బూరింతువో
త్వత్కృపార్ఘుకియంచుఁ దలతునెపుడు
ఇపుడు దాపింతువో యెపుడు దాపింతువో
త్వన్నామ సుధయంచుఁ దలఁతునెపుడు
ఈక్షణంబబ్బునో యేక్షణంబబ్బునో
త్వత్పాదసేవంచుఁ దలఁతునెపుడు

నొక్కటియు నింతదనుకనుఁ జక్కఁబడదు
కోర్కెలన్నియుఁ గొంతెమ్మ కోర్కెలయ్యె!—హరి॥

సీ॥ శస్త్రపరాక్రమశాలి సుగ్రీవున
కింతరాజ్యముఁగూర్చు టేమికీర్తి!
భువనరక్షణకళాపూర్ణుఁడౌ రామున
కింత సాయముఁజేయు టేమివింత!
స్థిరచిత్తసంకల్ప సీతామహాసాధ్వి
కింత శోకముమాన్పు టేమిగొప్ప!
సాహసోత్సాహ విస్తరకీర్తి సౌమిత్రి
కింత మూర్ఛనుదీర్చు టేమిఘనము!

నన్నునన్యగతికుని నాపన్నజనునిఁ
గరుణఁ గనుటొండె సత్కీర్తికరముగాక!—హరి॥

సీ॥ ఈ మందభాగ్యు నింకెట్లుగాఁబ్రోతువో
స్థిరభక్తి నినుఁ బ్రశంసింపలేదు
ఈ యవివేకి నింకేరీతిఁ జూతువో
భావించి నీయున్కిఁ బలుకలేదు
ఈ యసత్యాచారు నెటు గడతేర్తువో
గడుభక్తి నీపేరు నుడువలేదు
ఈ బుద్ధిహీనాత్ము నెట్లుద్ధరింతువో
విషయ మాయలఁబడి వీడలేదు

యిట్టి మలినాత్ము, నజ్ఞాను నేవిధానఁ
గరుణఁగాంతువో యొకఁగ విఖ్యాతచరిత!—హరి॥

సీ॥ దర్శనంబిచ్చినఁ దగనీయకుండిన
నమ్మి ప్రార్థించుచు నతులొనర్తు
కనులఁగాన్పించినఁ గాన్పింపకుండినఁ
జిత్తంబునిల్పి జే జే లొనర్తు
దయతోడఁ దన్పిన దయఁ దప్పకుండిన
ఘనభక్తిఁ బాదసేవనమొనర్తు
కనులెత్తిచూచినఁ గనులెత్తకుండిన
ననిశంబు మదినిఁ బ్రార్థనమొనర్తు

వీనులను నాదు మొఱవిన్న, వినకయున్న
నతి విధేయత నీకు జోహారొనర్తు!—హారి॥

సీ॥ కనులమూసియుఁ దారకపుమంత్రము జపించు
చును గనులెత్తవు స్తుతినొనర్ప
చిత్తమేకముఁజేసి స్థిరసమాధినిమున్గి
రాముఁజూచుచురావు ప్రేమఁబిల్వ
సర్వాంగకంబులు చలనంబులేకుండ
గూర్చొని మొఱవినఁ గోరవింత
స్వచ్ఛంపుభక్తికై సత్వకాంతివిశల
వెలుగంగ నిటరావు వినుతిసేయ

నన్నుఁగానవు దరిఁజేరి నమ్మియుంటిఁ
బాదసన్నిధి సాష్టాంగబడితి శరణు—హారి॥

సీ॥ ఉన్నవపురిలోన నుజ్వలమూర్తివై
భక్తాళికల్పమై బరఁగుహనుమ!
ఏకాండశిలపైని నేకశిలావృత
ప్రహరిగోడలమధ్యఁ బ్రబలుహనుమ!
రాజగోపాలుని రమ్యంపుగుడి పార్శ్వ
భాగంపుగుడిలోనఁ బరఁగుహనుమ!
అగణితమాహాత్మ్యమగు వీరరూపంబు
గాంచిలంగ భక్తులఁ గాచుహనుమ!

ఉన్నతాభయ వరముల నొసఁగుహనుమ!
వినుత భక్తి ముక్తులనిచ్చు వీరహనుమ!—హరి॥

సీ॥ ఘోరమహామ్మారి, క్రూరజాడ్యంబులుఁ,
బీడలు హతము నీపేరుఁజెప్ప
ఈతిబాధాళులు భీతావహంబులు
భిన్నంబులగును నీ పేరుఁజెప్ప
భయదదారిద్ర్యముల్ బాప సంఘంబులు
విచ్ఛిన్నములగు నీపేరుఁజెప్ప
ప్రాణాంతకపు బ్రహ్మరాక్షస భూతాది
భీతియడంగు నీపేరుఁజెప్ప

సకలబాధలుఁ గష్టముల్ వికలములగుఁ
దావకీననామాక్షరతతివచింప—హరి॥

సీ॥ ఉబుసుఁబోకకు నిన్ను నొకపరిఁ దలఁచినఁ
బాపసంఘంబులఁ బాసియుండు
నూరకఁ గూర్చుండి యొకసారి దలఁచిన
భక్తిముక్తులతోడఁ బరఁగుచుండు
నుత్పాదములుఁదోఁప నొకతూరిఁ దలఁచిన
నిత్యశుభముఁగల్గి నిలిచియుండు
నులుకుగల్గినయంత నొకమారుఁ దలఁచిన
భీతియంతయు వీఁగి ప్రీతినుండు
నీదు నామాక్షరంబుల నిష్ఠతోడఁ
బలుకు నెవ్వఁడుఁగాని దివ్యప్రభావ!—హరి॥

సీ॥ ప్లవఁగనాయక! కొను ప్రణుతులశ్రాంతంబు
వానర! కొనుము సద్వందనంబు
కపికులాలంకార! కైవారములుఁగొను
కోఁతిరాయఁడ! కొను కోటినతులు
శాఖామృగాకార! సాష్టాంగములఁగొను
కీశ! కొనుము నమస్కృతిశతంబు
ధరణిజాన్వేషక! దండంబులనుఁగొను
హరికుల! కొనుము నా యంజలులను
మునిజనాత్మీయ! కైకొను మ్రొక్కులెల్ల
భక్తమందార! కొనుము నా ప్రణుతులెపుడు—హరి॥

సీ॥ మెరుపు మెఱయుగీతి మేనిచాయలఁదేలి
వర సరోజముఁబంటి వదనమొప్పి
కల్పశాఖలఁబోలఁగల్గు నాజానుబా
హువులతో ఘనమైన యురమునొప్పి
బాలభానునిదీప్తి భాసిల్లుచేలంబు
కటిభాగమునఁగల్గఁ గాంతిమొప్పి
కాలపాశమునేంచు వాలంబుతోఁగ్రాలి
కనకకిరీటంపుఁ గళలనొప్పి

ముందుజూచిన పదమున నందమొప్పి
చేతఁబట్టిన వృక్షానఁ జెలువునొప్ప—హరి॥

సీ॥ శ్రీరాముని కమిత శ్రేమమీప్రముదాయ!
త్రిగుణనిరూపాయ! తే నమోస్తు!
శ్రీ లక్ష్మణస్వామి జీవనాధారాయ!
దిననాధశిష్యాయ! తే నమోస్తు!
శ్రీ జానకీదేవి జీవహితైకాయ!
త్రిదశేంద్రవినుతాయ! తే నమోస్తు!
సుగ్రీవమిత్రాయ! శుభగుణహారాయ!
దివ్యావతారాయ! తే నమోస్తు!

దీనజన భక్తపోషాయ! తే నమోస్తు!
మానిజన చిత్తచోరాయ! తే నమోస్తు!!—హరి॥

సీ॥ ఆంధ్రరాష్ట్రాంగనోద్యత్కంఠహారస్థ
సన్మణి "ఉన్నవ" జన్మభూమి
ఉన్నవవంశమహోదధిచంద్రుండు
రామకృష్ణయ్య వరాలతాత
అతులగుణపవిత్ర యత్యుత్తమచరిత్ర
గణియింప వేంకాంబిక పితృమాత
సజ్జనశ్రేష్ఠుండు, సత్వుండు, భక్తుండు
వేంకటసుబ్బయ్య వెలయుతండ్రి
సాధ్వీమతల్లి, ప్రశస్త సద్గుణవల్లి
మహి రాజమాంబిక మాతృదేవి

యగుచు, సోదరిణులు నల్వు, రలఘువిదుఁడు
సోదరుం డొక్కరుండుఁ బ్రశోభఁదనరు
రామకృష్ణాఖ్యుఁడ నియోగిభూమిసురుఁడ
తతసుభక్తి నీ పద్యరత్నశతకంబు
నర్పణముసేతుఁ గొనుము వీరాంజనేయ!!